

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

08 జూన్ 2025 పేజీలు : 08 ఆదివారం




## పోలీసుల అదుపులో.. నకిలీ ఐఆర్ఎస్ ఆఫీసర్

### రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

ఐఆర్ఎస్ ఆఫీసర్ అని చెప్పుకుంటూ నెల్లూరుకు చెందిన వెంకటరమణ అను వ్యక్తి దగ్గర భూ వివాదం పరిష్కరిస్తానని రెండు లక్షలు డిమాండ్ చేసి.. అదేవిధంగా తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డిని తాను ఐఆర్ఎస్ ఆఫీసర్ అని మోసపూరిత మాటలు చెప్పిన వ్యక్తిని శనివారం నగర డీఎస్పీ పి.సింధుప్రియా మీడియా ముందు హాజరు పరిచారు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన నిందితుడు రాంపూర్ రమేష్ (23) అను వ్యక్తి తాను ఐఆర్ఎస్ ఆఫీసర్ అని నెల్లూరుకు చెందిన వెంకటరమణ అను అతని భూమి వివాదం పరిష్కరిస్తానని చెప్పి రెండు లక్షల రూపాయలు అడిగి ఆ మేరకు నిందితుడు నకిలీ ఐఆర్ఎస్ నేమ్ బోర్డ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిస్ట్రిక్ట్ రీజినల్ కమిషనర్ నేషనల్ కలిగిన బోర్డ్, రీజనల్ కమిషనర్ నెల్లూరు అనే స్టాంపును

02

## దేశానికే రోల్‌మోడల్‌గా వీఆర్ హైస్కూల్



దేశంలోని రోల్ మోడల్‌గా వీఆర్సీ హైస్కూల్ ఉండబోతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న అధునీకరణ పెయింటింగ్ పనులు, గ్రౌండ్‌లో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాట్లు.. క్లాస్ రూముల్లో డిజిటల్ ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్ ఏర్పాటుపై శనివారం పరిశీలించి ఎన్‌సీసీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

05

## ఆనం వెంకటరెడ్డి విగ్రహ పున: ఆవిష్కరణ ఏర్పాట్లు



లోపల పేజీలో



## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదిన వేడుకలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :**

ముస్లిం సోదరులు శనివారం త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయగిరి పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈద్గాల వద్ద మతపెద్దలు ఖురాన్ సందేశం ఇచ్చారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బంధుమిత్రులను విందుకు ఆహ్వానించి సహపంక్తి భోజనాలు చేశారు. పేదలకు దానధర్మాలు చేయడంతోపాటు ఖుర్బానీ అందజేశారు.

## బెయిల్‌పై కాకాణి అనుచరుడు విడుదల



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :**

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు నిరంజన్‌రెడ్డి శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల కేసుకు సంబంధించి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు నిరంజన్ రెడ్డిని శుక్రవారం సిట్ పోలీసులు బెంగుళూరులో అరెస్ట్ చేశారు. నిరంజన్ రెడ్డిని నెల్లూరు నగరంలోని న్యాయమూర్తి ఇంటి వద్ద శనివారం పోలీసులు హాజరు పరిచారు. పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టు నిబంధనల ప్రకారం లేకపోవడంతో తిరస్కరించి నిరంజన్ రెడ్డిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తూ.. రెండవ అదనపు ఇంచార్జ్ మేజిస్ట్రేట్ పాల మంగళం వినోద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పల్లా సింహాచలం మరణం విచారకరం : ఎంపీ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణం విచారకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. 1994లో నాటి విశాఖపట్నం-2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, విశాఖపట్నంలో ఆయన చేసిన అభివృద్ధి ఇప్పటికీ శాశ్వతంగా నిలిచి ఉందన్నారు. పల్లా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. పల్లా సింహాచలం ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

ఇంటర్మీడియట్ ఇంప్రూవ్మెంట్ పరీక్ష ఫలితాల్లో కూడా

# శ్రీ వశిష్ట కాలేజీ ప్రథమ స్థానమే

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక పుల్లారెడ్డి నగర్‌లో శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల స్థాపించి అనతి కాలంలోనే వరుసగా కావలి పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో వరుసగా ర్యాంకులు సాధిస్తూ, రావడం విద్యార్థుల ఫలితాల్లో మంచి ప్రతిభను కనపరిచి ఉన్నత స్థానంలో నిలిచిన సంస్థ శ్రీ వశిష్ట విద్యా సంస్థ. అలాగే ఇంప్రూవ్మెంట్‌లో కూడా ఈ విద్యాసంస్థల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి పాఠశాలకు కీర్తి పతాకములు ఎగరవేసిన విద్య కుసుమాలకు కళాశాల కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి వారికి అభినందనలు తెలిపారు. అలాగే వారు మాట్లాడుతూ.. మా కళాశాలలో నాణ్యమైన విద్యతో, పాటు హాస్టల్ వసతి తో పాటు విద్యార్థిని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, విద్యాబోధనలో మేటిగా నిలవడం జరిగిందని, అలాగే ప్రతి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి, కీర్తి,ప్రతిష్టలు కళాశాలకు తీసుకువచ్చిన ప్రత్యేకగా అభినందించారు. అలాగే ఉపాధ్యాయులకు సిబ్బంది కూడా ప్రత్యేకంగా వారిని అభినందించడం జరిగింది.




# మాజీ కౌన్సిలర్ నేడు టీడీపీలో చేరిక



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి అలాగే మాజీ కౌన్సిలర్ వైసీపీకి బలమైన సపోర్టర్ నాయకుడు కావలి పట్టణమే కాకుండా నియోజకవర్గంలో జనిగర్ల మహేంద్ర యాదవ్ తెలియని వారు అంటూ ఎవరు ఉండరు. తను ప్రతి సంవత్సరం పేదలకు అన్నదాన కార్యక్రమం అయ్యప్ప మాలలు వేసిన వారికి కావలి పట్టణంలోనే కాదు నియోజకవర్గం లో 40 రోజులపాటు ఉచితంగా తన లేవుట్లులో అయ్యప్ప స్వాముల వారికి ఉదయం టిఫిన్, భోజనం, రాత్రి బిక్ష నిరంతరం ప్రతి సంవత్సరం తన తను ఈ సేవలను సాగిస్తుండడమే కాకుండా అయ్యప్ప భక్తులను తను సొంత ఖర్చులతో శబరిమలైకి తీసుకువెళ్లే వారు కావలి పట్టణంలో నియోజకవర్గంలో జనిగర్ల మహేంద్ర అంటేనే ఒక బ్రాండ్. తను రియల్ ఎస్టేట్ రంగంలో రారాజుగా ఎదిగి ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ తను సాధారణ జీవితాన్ని జీవించడం ప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. సుదీర్ఘంగా 25 సంవత్సరాలు తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఈ 25 సంవత్సరాలు, ఎవరు ఎన్ని పార్టీలు మారినప్పటికీ ఎంతమంది పార్టీలు మారినప్పటికీ తను మాత్రం ఏ పార్టీలు మారకుండా ఒకే పార్టీలోఉంటూ, ప్రతి సంవత్సరం కృష్ణుడు గుడి దగ్గర జరిగే ప్రతి కార్యక్రమంలో తను పాలు పంచుకుంటూ తన సొంత ఖర్చులతో అక్కడి కార్యక్రమాన్ని వ్యయ, ప్రయాసలువడ్డీ నిర్వహించడం పాత ఊరు ప్రజల మొత్తం తను అంటే ఒక మంచితనాన్ని సంపాదించుకొని అక్కడి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. 2024 ఎన్నికల్లో వైసిపి పార్టీ ఘోరంగా పరాభవంచెందింది. అయితే ఎంతమంది తెలుగుదేశం పార్టీకి వెళ్లినప్పటికీ కూడా తను అదే పార్టీలో కొనసాగిస్తున్నారు. కానీ తప్పని పరిస్థితుల్లో పార్టీ మారవలసి వస్తుందని విశ్వసినీయ సమాచారం. మరి ఆదివారం తను భారీగా కార్యకర్తలతో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేరనున్నట్లు తెలిపారు. మరి పార్టీలో తనకు స్థానం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# ఆత్మకూరులో భక్తిశ్రద్ధలతో బక్రీద్‌వేడుకలు





## ఈద్గాలో వేలాదిమంది ప్రార్థనలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో శనివారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక బిఎస్ఆర్ సెంటర్‌లోని శ్రీశ్రీశ్రీ సుల్తాన్‌షాహిద్ దర్గా అనుబంధ ఈద్గాలో ఇమామ్ పేష్మామ్ ఖమ్రుజమా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రార్ధనలు నిర్వహంచారు. పట్టణంలోని ముస్లింలు ర్యాలీగా ఈద్గాకు చేరుకొని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇమామ్ బక్రీద్ గురించి వివరించే సందేశమిచ్చారు. తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడులు ఈద్గాలో ప్రార్థనల్లో ఉన్న ఇమామ్, ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రెండవ పండుగ బక్రీద్ (ఈదుల్‌ఆజహ్) అని, దేవుని ఇస్లాంబతం కోసం తన కన్నబిడ్డసైతం తనచేతులతోనే బలి (ఖుర్బాని) ఇచ్చిన రోజుఅని, త్యాగానికి ప్రతీక అని ఇమామ్ వివరించారు. మానవుడు ఆచరించాల్సిన నాలుగు ధర్మాలను పవిత్రరంజాన్ మాసంలో ఆచరించగా ఐదవదయిన హాజ్‌సందర్భన కోసం బక్రీద్‌లో ఆచరిస్తామరన్నారు. బక్రి అంటే మేకఅని, ఈద్ అంటే పండుగ అని, బక్రీద్ అంటే దైవాజ్ఞను పాటించే భక్తులు దేనినైనా సమర్పిస్తారనడానికి నిదర్శనంగా చెప్పవచ్చున్నారు. మానవుని సృష్టించిన దేవుడు ప్రపంచంలో అన్నివిదాలా సదుపాయాలు కల్పించి వాటిని అనుభవిస్తూ తనను ధ్యానం చేయమని ఆదేశించాడని ఆయన వివరించారు. పవిత్ర ఖురాన్‌లో పలు సంఘటనలు పొందుపరిచారన్నారు.

ఇబ్రహీమ్ సాలై ఆలాసాహూసొల్లామ్ భగవంతుని ఆజ్ఞతో తన కన్నబిడ్డను బలి ఇవ్వడం గమనిస్తే త్యాగనిరతికి నిదర్శనమని, ఈపండుగ సందర్భంగా జరిపే ప్రార్థనలు ఈదుల్ ఆజహ్ అని చెబుతారన్నారు. పండుగ సందర్భంగా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతోపాటు పేదలకు దానధర్మాలు చేశారు. మండలంలోని కరటంపాడు, మహిమలూరు, వెంకట్రావుపల్లి, నాగులపాడు, బి.చిరువెళ్ళ, దేపూరు, నెల్లూరుపాళెం తదితర గ్రామాల్లో కూడా ముస్లింలు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

## నల్లపరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇటీవల చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరు కొండయ్యపాలెం గేట్ సెంటర్‌లోని వారి నివాసంలో శనివారం ప్రసన్న కుమార్ రెడ్డిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా లిప్రసన్నకుమార్‌రెడ్డి యోగక్షేమాలను చంద్రశేఖర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసన్నకుమార్ రెడ్డితో చంద్రశేఖర్ రెడ్డి పలు విషయాలను చర్చించారు.

## తుది దశకు చేరుకున్న ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణ ఏర్పాట్లు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో పునః ఆవిష్కరించనున్న మాజీ మంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి తదితరులు శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి పనులు తుది దశకు చేరుకున్నాయని, ప్రజా నాయకులుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత నేత ఆనం వెంకటరెడ్డి పేద బడుగు బలహీన వర్గాలకు ఎనలేని సేవలు అందించారని వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని స్థానిక రామలింగాపురం సెంటర్లో వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతోపాటు పలువురు పుర ప్రముఖులు హాజరుకానున్నారని తెలియజేశారు.

## పోలీసుల అదుపులో నకిలీ ఐఆర్ఎస్ ఆఫీసర్

*(మొదటి పేజీ తరువాయి)*

తయారు చేయించుకుని, కేఏ36 జెడ్ 2681 నెంబరు గల కారులో అతని స్వగ్రామమైన దొంగరాంపూరు కర్ణాటక రాష్ట్రం నుండి నెల్లూరుకు వచ్చి సదరు వెంకటరమణకు ఫోన్ చేస్తే కలవలేదని, మంగళవారం రాత్రి నిందితుడు నెల్లూరులోని ఆదిత్యనగర్ రెండవ వీధిలో ఉన్నాడు. 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల సమయంలో నిందితుడు నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలోనికి వెళ్లి దేవస్థానం ఈవో ఆళ్ల రామకృష్ణారెడ్డితో తాను అయ్యారా ఆఫీసర్లను రీజనల్ జాయింట్ కమిషనర్‌గా బదిలీపై నెల్లూరుకు వచ్చి రిపోర్ట్ చేసుకునే దానికి ముందుగా స్వామివారి దర్శనంకు వచ్చానని చెప్పి దర్శనం చేసుకుని తాను ఆదాయపు పన్ను గురించి, భూ వివాదాలు గురించి చూస్తుంటానని చెప్పి భూ వివాదాలకు సంబంధించిన రిపోర్ట్ కాపీ కావాలని కోరగా, ఈవో భూ వివాద రిపోర్ట్ కాపీపై రీజినల్ కమిషనర్ నెల్లూరు అని స్టాంప్ వేసి తీసుకువెళ్లాడని, అదే రోజు సాయంత్రం 5 గంటల సమయంలో దేవస్థానం ఈవోకి ఫోన్ చేసి తనని కలవాలని చెప్పగా, ఈవో ఇప్పుడు వీలు పడదని సమాధానం చెప్పాడు. ఈవో ఆళ్ల రామకృష్ణారెడ్డికి అనుమానం రావటంతో అతని గురించి విచారించగా అతను నకిలీ ఐఆర్ఎస్ ఆఫీసర్ అని గుర్తించి సంతపేట పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా సంతపేట పోలీస్ స్టేషన్ సీఐ దశరథ రామారావు, ఎస్ఐ బాలకృష్ణ వారి బృందం నిందితుడిని శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని ఆదిత్య నగర్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుండి రమేష్ రాంపూర్ టిఆర్ఎస్ ఆఫీసర్ నేమ్ ప్లేట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిస్టిక్ రీజినల్ కమిషనర్ నేషనల్ ఎంబ్లెమ్ కలిగిన బోర్డ్, రీజనల్ కమిషనర్ నెల్లూరు అను స్టాంప్, కేఏ 36 జెడ్ 2681 అని కారు, రెండు సెల్ ఫోన్లు, ఫిర్యాదు ఇచ్చిన రిపోర్ట్ కాపీని దర్యాప్తుని నిమిత్తం స్వాధీనం తీసుకొని ముద్దాయిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సంతపేట ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పంటపాలెంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

**హాజరైన శాస్త్రవేత్తలు, సూచన, సలహాలు స్వీకరించిన రైతులు**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పంటపాలెం గ్రామ పంచాయతీ రైతు సేవ కేంద్రం నందు కేంద్ర ప్రభుత్వం శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఐసిఏఆర్ శాస్త్రవేత్త డీవీకే నాగేశ్వరరావు హాజరయ్యారు. అదే విధంగా మత్స్య శాస్త్రవేత్త హరి సాధు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో అధిక రసాయనిక ఎరువులు వాడకం చేయడం వల్ల రైతుల వ్యవసాయ భూములు సారవంతం కోల్పోయి నిరుపయోగంగా మారుతాయిని తద్వారా భూములు స్థితి కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డీవీకే నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగినట్లు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూమి సారవంతంగా ఉండాలంటే అధిక రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి సహజ సిద్ధమైన ఎరువులను వినియోగించాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ద్వారా అవసరమైన ఎరువులను వాడడం వలన ఆరోగ్యవంతమైన నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చని దీనివలన భూమి ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా తద్వారా ప్రజల యొక్క ఆరోగ్యం కూడా కాపాడే దానికి అవకాశం ఉంటుందని శాస్త్రవేత్త రైతులకు సూచించారు. సమగ్ర చేపల పెంపకం గురించి మత్స్య శాస్త్రవేత్త వివరించారు. కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు పల్లం రెడ్డి శ్రీధర్ రెడ్డి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి, గ్రామ విఏఏ రమ, ఆక్వా, వ్యవసాయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వికుల సమాధుల పగలగొట్టారని బాధితులు ఆందోళన



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని రామవరప్పాడు గ్రామంలో తమ పూర్వికుల సమాధులను శుక్రవారం అర్ధరాత్రి కొంతమంది పగలగొట్టారని గ్రామానికి చెందిన బొడ్డు శోభన్ కుమార్, బొడ్డు ఉదయ్ కుమార్, బోర సౌజన్యలు శనివారం జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. మా తల్లిదండ్రులు మరణించిన తర్వాత గ్రామ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించి సమాధులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మా తల్లిదండ్రులకు సమాధుల వద్ద సంవత్సరికలు కూడా చేస్తున్నామన్నారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రవి అండతో గ్రామానికి చెందిన శెట్టిపల్లి శ్రీనివాసులు, గుండా బత్తిన నితిన్, బొడ్డు సుధీర్, బొడ్డు కాంతమ్మ, గళ్ళ జని, ఎకోబు, తదితరులు తమ పూర్వికుల సమాధులను ధ్వంసం చేశారన్నారు. స్మశాన స్థలాలను సైతం ఆక్రమించుకునేందుకు మా సమాధులను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ గ్రామంలో కూడా ఉండనివ్వకుండా చేస్తామనిభయపెడుతున్నారని వాపోయారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## గార్లపాటి ఔదార్యం..

# పేదవిద్యార్థులకు కార్పోరేట్ విద్యాయోగం

- ప్రతిభావిద్యార్థులకు 83లక్షల స్కాలర్‌షిప్‌లు
- త్వరలో మరో ముగ్గురికి పంపిణీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడుకుచెందిన మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి మెంబర్, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, ఆయన సోదరులు ల్యాంకోగ్రూప్‌ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్, గార్లపాటి ఫౌండేషన్ చైర్మెన్ గార్లపాటి భాస్కరనాయుడు, ల్యాంకో చెన్నైశాఖ మేనేజర్ గార్లపాటి సుబ్బారావు సోదరుల ఔదార్యంతో అనేకమంది టెన్త్‌లో ప్రిభచూపే విద్యార్థులు కార్పోరేట్ కాలేజిల్లో విద్యాభ్యాసం గావించే మహత్తర అవకాశం లభిస్తోంది. ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో ప్రతిభచూపిన మరో ముగ్గురు విద్యార్థులకు కూడా త్వరలో పంపిణీ చేయనున్నారు. తమ స్వగ్రామమైన కరటంపాడులోని టిజెఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2005నుండి అక్కడ చదివే విద్యార్థులందరికీ యూనిఫారం దుస్తులు, నోటుపుస్తకాలు అందజేస్తుండడంతోపాటు టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1లక్షల రూపాయలవంతున స్కాలర్‌షిప్‌లు తమ ట్రస్ట్‌ద్వారా అందజేస్తూ వారు కార్పోరేట్ కాలేజిల్లో చదువకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈస్కూల్లో ఆరు అదనపు తరగతిగదులను, విశాలమైన స్టేజిని, ప్రహరీగోడ తదితరాలను నిర్మించారు. దాదాపు 2కోట్లరూపాయలకు పైగా ఈ పాఠశాలకు వారు వెచ్చించారు. కోట్లాదిరూపాయలతో వారు వివిధ సామాజిక సేవలందిస్తున్నారు. దాదాపు 28లక్షల వ్యయంతో గ్రామంలో శ్మశానాన్ని ఆధునీకరించారు. ఉర్దుపాఠశాల, పంచాయతీ కార్యాలయాలకు ప్రహరీగోడలు నిర్మించారు. వందలాదిమంది వికలాంగులకు కృత్రిమఅవయవాలు, ట్రై సైకిళ్ళు, వీల్‌చేర్స్, చేతికర్రలు, వినికిడి యంత్రాలు తదితరాలను తరచూ పంపిణీ చేస్తుంటారు. వాటర్‌ప్లాంట్లు నిర్మించి ప్రజలకు ఉచితంగా పరిశుద్ధమైన త్రాగునీటిని సరఫరాచేస్తుంటారు. ఒక మొబైల్‌వాహనం ఏర్పాటు చేసి 12గ్రామాలకు తమ సిబ్బంది ద్వారా వైద్యసేవలందించారు. గ్రామంలో పారిశుధ్యమెరుగుకు 4.5లక్షల రూపాయల విలువగల ఒక ట్రాక్టర్‌ను కూడా ట్రస్ట్ ద్వారా అందజేశారు. తమ జన్మస్థలం, తాము కనీససౌకర్యాలు లేని రోజుల్లో తమ గ్రామంలోనే విద్యాభ్యాసంగావించిన ఉన్నత పాఠశాలకు తమవంతు సాయమందించాలని, విద్యార్థులకు చేయూతివ్వాలని, వారిని ప్రోత్సహించాలని, పేదా, ధనిక తేడాలేకుండా కార్పోరేట్ కాలేజిల్లో చదువుకునే అవకాశం కల్పించాలన్న లక్ష్యంగా తాము సేవలందిస్తున్నామని, జన్మనిచ్చిన గ్రామం, తమ నియోజకవర్గంలో తమవంతుగా సామాజికసేవలందించాలన్న లక్ష్యంగా, అందరికీ విద్య,వైద్యం, ఆరోగ్యం ఉండాలన్న ఆశయం, సంకల్పంతో తాము ఈ విధమైన సేవలందిస్తున్నామని, తాము ఉన్నత విద్య అభ్యశించి స్థితిమంతులమై స్థిరపడినందున ఈవిధమైన సేవలందించేలా కొనసాగుతున్నామని వేణుగోపాల్‌నాయుడు పేర్కొన్నారు.



## ప్రమాదమృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలకు నిత్యాన్నదాత, శ్రీ సాంబశివాచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి 25వేల రూపాయలవంతున 50వేల రూపాయల ఆర్థికసాయాన్ని శనివారం అందజేసి తన మానవీయదాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల ఆత్మకూరు సమీపంలో నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో పుల్లారెడ్డి, అజీమా అనేవారు మృతిచెందడం, మరో 9మందికి గాయాలు కావడం తెల్సిందే. వెంకట్రావుపల్లిలోని మృతుల ఇళ్ళవద్దకు వెళ్ళిన పరమేశ్వరరెడ్డి ఆ కుటుంబసభ్యులకు 25వేల రూపాయలవంతున సాయమందించారు. ఆ కుటుంబాలను పరమేశ్వరరెడ్డి ఓదార్చారు. వారు ఆయనకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునే దానగుణం కలిగి అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పరమేశ్వరెడ్డి దైవకృపతో మరింతగా తమలాంటి పేదలను ఆదుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటారెడ్డి, ట్రస్ట్ ప్రతినిధి మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధిష్టానం అనుమతిలేకుండా పార్టీలోకి ప్రవేశం తగదు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం అధిష్టానం అనుమతి లేకుండా ఎవరినీ టిడిపిలో చేరుకునేందుకు వీలుకాదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు. పార్టీ జాతీయఅధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో తాను ఈ ఉత్తర్వులిచ్చానని పేర్కొన్నారు. ఈమేరకు ఈ ఉత్తర్వులు పార్టీకి చెందిన ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రముఖ నాయకులకు అందాయి. ఏపార్టీవారైనా టిడిపిలో చేరాలంటే వివరాలు తమకు తెలిపి తమ అనుమతితోనే చేర్చుకోవాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిద పార్టీలకు చెందిన వారు అధికార టిడిపిలో చేరాలంటూ ఇక ఆషామాషీ కాదంటూ పలువురు ఆపార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

## విజన్-2047పై కమిషనర్ సమీక్ష



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర విజన్ 2047 నెల్లూరు సిటీ కాన్సెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ టీంతో శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్ మోహన్ రావు, సెక్రటరీ శ్రీలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి ధర్, సిటీ కాన్సెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యుత్ ఘాతానికి గురై చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల మేరకు మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ (65) ఉదయగిరి పట్టణంలోని ఆనకట్ట పై నడుచుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్పై పడి శుక్రవారం తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

# 11న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** 2025 జూన్ 11 బుధవారం నెల్లూరు నగరంలోని డీజీపీ కళ్యాణ మండపం నందు పద్మశాలి విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘ ప్రతినిధుల సమావేశం నెల్లూరు నగరంలో గల మనం హాస్పిటల్ నందు జరిగింది. జరగబోయే కార్యక్రమ నిర్వహణ గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులతో అన్ని అంశాలు చర్చించాము. అందరి యొక్క అభిప్రాయాలు తెలియజేశారు. అందరూ అభిప్రాయాలు తెలియజేసిన తర్వాత కార్యక్రమం నిర్వహణ ఎలా జరపాలని అందరం కలిసి ఏకఅభిప్రాయంతో తీర్మానం చేసాము. ప్రతి ఒక్కరికి ఒక్కొక్క బాధ్యత అప్పజెప్పడం జరిగింది. అందరం టీం వర్క్‌తో కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ ప్రతినిధులు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్, ఉపాధ్యక్షులు జానపాటి రామసుబ్బయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర యువసేన ప్రతినిధి మునగపాటి రమేష్, గౌరవ సలహాదారు చింతలపూడి పెంచలయ్య, డాక్టర్ మారం సుధాకర్, డాక్టర్ మారం మాధవ, చింతగంజల శ్రీధర్, చొప్ప మురళి నీలి వెంకట తేజ పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో దివంగత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, యూనియన్ నాయకులు కామ్రేడ్ వై తారకానాథ్ 21వ వర్ధంతిని సందర్భంగా ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జిఎస్‌ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తారకానాథ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందించారాని అన్నారు. వారి వర్ధంతి సందర్భంగా కావలి సిబ్బంది, వినియోగదారులు రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. పలు బ్రాంచులలో ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికి రక్తదానం అపురూపమైన సేవా కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది రక్తదాతలను సమీకరించిన ముంగమూరు గ్రామ మాజీ సర్పంచ్ యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్‌లను సత్కరించారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో 66 మంది రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిరిధర్, కావలి మెయిన్, టౌన్, ట్రంక్ రోడ్డు బ్రాంచ్‌ల కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, జ్యోస్న, సుమన, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రకాశరావు, టి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు ఎస్‌కే నయీమ్, ఎన్.ప్రణీత్, టీం సేవియర్స్ తరపున హరిచందన పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి దక్కని ప్రతిభ అవార్డు.!



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులలో బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పోతల ధనలక్ష్మి 592 మార్కులు సాధించినప్పటికీ అవార్డుకు ఎంపిక కాలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మార్కులు వచ్చిన ఇద్దరు ఓసి ఇద్దరు బీసీ ఒక ఎస్సీ ఒక ఎస్టీ ప్రకారం మండలానికి ఆరు మందిని ఎంపిక చేయబడతారు. ఇద్దరు విద్యార్థులు ఒకే మార్కులు తెచ్చుకుంటే వారిద్దరూ ఎంపిక కాబడతారు. దీని ప్రకారం వింజమూరు మండలంలో ఆరు అవార్డులకు గాను ఏడుగురుని ఎంపిక చేశారు. ఓసీలో ముగ్గురు బీసీలు ఇద్దరు ఎస్సీ 1 ఎస్టీ ఒకటిగా ఉంది. 591 మార్కులతో నారాయణ స్కూల్‌కి చెందిన ఇద్దరు ఓసి విద్యార్థులు 595 మార్కులు మరొకరు మొత్తం ముగ్గురు ఓసిలు ఎంపికయ్యారు. అయితే 592 మార్కులు ఉన్న తెచ్చుకున్న పి.ధనలక్ష్మి బిసి బి ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థి ఈ జాబితాలో చేరలేదు. అన్ని వసతులు ఉన్న ప్రైవేట్ పాఠశాలలతో కలిపి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పోల్చడమే తప్పు.. గాడిద గుర్రం ఒకటే అను సామెతగా ప్రభుత్వ విద్యాశాఖ 591 మార్కులకు అవార్డు ఇచ్చి 592 మార్కులు పొందిన ధనలక్ష్మికి అన్యాయం చేయడం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనని ఉపాధ్యాయ వర్గం తల్లిదండ్రులు తూర్పురా పడుతున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పేద విద్యార్థి పట్ల పరిశీలన చేసిపి ధనలక్ష్మికి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఉన్న ముస్లింలు బక్రీద్ పండగ దినాన్ని పురస్కరించుకొని శనివారం ప్రతి మసీదులో ముస్లింలు ప్రార్ధన మందిరాల్లో ప్రార్ధనలు నిర్వహించారు. అలాగే పేద వారికి ఈ పండుగ సందర్భంగా అన్నదానమ్, వస్త్రలు పేదలకు పంపిణీ కార్యక్రమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలను గౌరవిస్తూ కార్యక్రమాలను నిర్వహించారు.

# ప్రభుత్వ మార్గదర్శకాలతో నాణ్యమైన విద్యుత్ సేవలు



- వినియోగదారులకు సంతృప్తికరంగా సేవలందించాలి
- ఏపీఎస్పీడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఏపీ రాష్ట్రప్రభుత్వ దిశ, నిర్దేశిత మార్గదర్శకాలతో నాణ్యమైన విద్యుత్ సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు ముందస్తు యాక్షన్ప్లాన్తో చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య ఆదేశించారు. శనివారం జిల్లా సందర్శన నిమిత్తం విచ్చేసిన ఏపీఎస్ పీడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య స్థానిక విద్యుత్ భవన్ స్కాడా సమావేశ మందిరంలో నెల్లూరు రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ పరిధిలోని అధికారులతో మెరుగైన విద్యుత్ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత రూరల్ డివిజన్ పరిధిలోని 33/11 కెవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన అక్కడి రికార్డులు, ఫీడర్ల లోడ్ వివరాలు, అంతరాయాల నమోదు ప్రతాలు, నిర్వాహణ పరిస్థితులను పరిశీలించిన మీదట సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదే క్రమంలో రూరల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సరఫరా స్థితిగతులు, వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదుల తాలూకు నివేదికలు, ఇంప్రూవ్మెంట్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సేవలపై వినియోగదారుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి నేరుగా సకరించే ఫీడ్బ్యాక్కు సంబందించి ప్రధానంగా 'అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందా.. మీ ప్రాంతంలో వోల్టేజి సంబంధిత సమస్యలు ఉన్నాయా.. విద్యుత్శాఖ అధికారులు, సిబ్బంది స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా..? అన్న మూడు అంశాలపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం జరుగుతుందని, ఈ పరిస్థితుల్లో సంబందిత అధికారులు, సిబ్బంది నిబద్ధత, సమర్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అదేవి ధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన 'సోలార్ విద్యుత్ను ఉపయోగిద్దాం.. విజన్-2047లో భాగస్వాములవుదాం' అన్న నినాదం అధికారులు, సిబ్బంది తోపాటు సొంత ఇళ్లు కలిగిన ప్రతి వినియోగదారునికీ ఆచరణీయం కావాలని, సూర్యఘర్ పథకం అమలుపై ప్రజలకు అవగాహన పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి పథకాన్ని మరింతగా ప్రోత్స? వాంచాలని సూచించారు. ఇదేక్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించిన వెంటనే వోల్టేజి స్థిరీకరణకు అవసరమైన ఇంప్రూవ్మెంట్ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, నిత్యం క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వినియోగదారులకు సకాలంలో నాణ్యమైన సేవలందించడమే సంస్థ ద్యేయమని గుర్తు చేసిన ఆయన, విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలకునుగుణంగా పనిచేయడం విద్యుత్ ఉద్యోగులు భాధ్యతగా భావించాలని, మెరుగైన విద్యుత్ సేవలందించడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈసమావేశంలో విద్యుత్శాఖ ఉమ్మడి జిల్లా పర్యవేక్షక ఇంజనీరు విజయన్, సూర్యఘర్ నోడల్ ఆ ఫీసర్ శేషాద్రి బాలచంద్ర, నెల్లూరు రూరల్ విద్యుత్ ఆపరేషన్, ట్రాన్స్ఫార్మర్స్ డివిజన్స ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఆడేపూడి సోమశేఖర్రెడ్డి, లక్ష్మీనారాయణ, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యు ప్రభాకర్రావు, జువ్విగుంట రాము, పి.సుబ్రహ్మణ్యం. సురేష్, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# దేశానికే రోల్ మోడల్‌గా వీఆర్ హైస్కూల్ : పొంగూరు షరిణి



నాడు అలా..






నేడు ఇలా..



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** దేశంలోని రోల్ మోడల్‌గా వీఆర్సి హైస్కూల్ ఉండబోతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. ఈ సందర్భంగా విఆర్ హై స్కూల్‌లో జరుగుతున్న అధునీకరణ పెయింటింగ్ పనులు, గ్రౌండ్‌లో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాట్లు.. క్లాస్ రూముల్లో డిజిటల్ ఎక్విప్ మెంట్, ఫర్నిచర్ ఏర్పాటుపై శనివారం పరిశీలించి ఎన్‌సీసీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పొంగూరు షరిణి మీడియాతో మాట్లాడారు.. మా నాన్న నారాయణ గారు పేద కుటుంబం నుంచి వచ్చారని.. పేదల కష్టాలు మా కుటుంబానికి బాగా తెలుసన్నారు. విఆర్సీలోనే చదివి మా నాన్నగారు ఉన్నత స్థాయికి ఎదిగారాని ఆమె కొనియాడారు. రాష్ట్రానికి గవర్నర్‌ని అందించిన ఘనమైన చరిత్ర నెల్లూరు విఆర్సీకి ఉందని హర్షం వ్యక్తం చేశారు. మూత పడ్డ వీఆర్ హై స్కూల్‌ని నిరుపేదపిల్లల కోసం ఆధునీకరించాలని నాన్న సంకల్పమని, అదే బాధ్యతను తనకు అప్పగించారన్నారు. ఆధునీకరణ పనులు పూర్తి కావొచ్చాయన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి ధీటుగా వీఆర్సీ రూపుదిద్దుకొంటోందని తెలిపారు. వీఆర్ హై స్కూల్‌లో ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, డిజిటల్ విద్యను పేదపిల్లలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మంచి వాతావరణంలో విద్యాబోధన అందించడమే లక్ష్యం అన్నారు. ఏపీని డిజిటల్ రాష్ట్రంగా చేయాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, నాన్నగారి సంకల్పం వెల్లడించారు. అదేవిధంగా దేశంలోనే రోల్ మోడల్‌గా విఆర్సీ ఉండబోతోందని ఘంటాపథంగా చెప్పారు.

# అమ్మవారిని దర్శించుకున్న సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి తిరునాళ్లలో సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉప సర్పంచ్ మేనాటి శీనయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలలో చిన్నపిల్లల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుణాళ్ల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు పాపిరెడ్డిపాలెం గ్రామస్తులపై నిండుగా ఉండాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని గెలిపించిన పాపిరెడ్డి పాలెం ప్రజలకు నిరంతరం రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం టీడీపీ నాయకులు దద్దోలు మనోహర్ ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి హరిబాబు మేనాటి విజయ్ మేనాటి నిరంజన్ మేనాటి ప్రసాద్ మేనాటి సుబ్రహ్మణ్యం అత్తిపాటి శివప్రసాద్ ఉప్పల మదన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీదు వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ముస్లిం సోదరులు శనివారం తనకు పవిత్రమైన బక్రీదు పండుగను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో బక్రీదు వేడుకలు జరుపుకున్నారు. ఉదయాన్నే శుభ్రంగా స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి బంగ్లా సెంటర్లోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. ముక్తి మౌలానా నిజాం ఆధ్వర్యంలో అల్లాహ్ ప్రార్థనలు జరిపించారు. అల్లాహు అక్బర్ అంటూ ఏడుసార్లు ప్రార్థన చేశారు త్యాగానికి చిహ్నంగా ఉండాలని సూచిస్తుందని తెలిపారు. ముందుగా నమాజ్ చదివి అనంతరం బక్రీదు పద్ధతులను ఆచరించారు. ఈద్ అల్ అథా అనే పండుగను బక్రీద్ అని పిలుస్తారని బక్రీదు పండుగ రోజున ప్రవక్త ఇబ్రహీం ఆజ్ఞకు విధేయత చూపుతూ తన కొడుకును బలి ఇవ్వడానికి సంసిద్ధతను గుర్తుచేస్తుంది అల్లాహ్ పట్ల తనకున్న అచంచల భక్తిని ప్రదర్శిస్తుందని అలాగే ముస్లిం సమాజానికి చెందిన ప్రజలందరూ ఉదయాన్నే అల్లాహ్ కు ప్రార్థనలు లేదా నమాజ్ చేయడం ద్వారా రోజు వారి పనులను ప్రారంభిస్తారు. ప్రార్థనలు అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే మిఠాయిలు పంచుకున్నారు. త్యాగానికి దానధర్మాలు చేయడం అలాగే ఇతరులకు సహాయం చేయడం తదితర పనులను చేశారు బక్రీద్ పండుగ ఇతరులకు సహాయం చేయడమే ఉద్దేశంగా నిర్దేశింపబడిందని వారు తెలిపారు. ఈద్గా వద్దకు వింజమూరు వాసులే కాకుండా పరిసర గ్రామాల వాసులైన ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరై అల్లాహు ప్రార్థనలో పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీ చేసి పత్రాలు సక్రమంగా లేని వాటికి అపరాధరుసుం విధించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ప్రతిఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని, ఆటోవాలాలు పరిమితికిమించి ప్రయాణికులు చేరవేయరాదాని, మద్యం సేవించి ప్రమాదాలకు గురికావద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



# జలాధివాసంలో శ్రీ సీతారాములు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికేఆర్ ఎస్టీ కాలనీలో జరుగుతున్న శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శ్రీరాముడు సీత లక్ష్మణుడు ఆంజనేయుడు విగ్రహాలను జలాధివాసంలో ఉంచారు మొదటి రోజు అంకురార్పణగా జరిగింది. కార్యక్రమాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు హోమాలు అభిషేకాలు జరిపించారు రెండవ రోజు శనివారం గణపతి పూజ వేద పారాయణం క్షీరాభిషేకం వేదిక ప్రధాన హోమాలు మూలమంత్ర హోమాలు సుదర్శన హోమం జరిపించారు. మధ్యాహ్నం 4 గంటలకు స్వామివారి గ్రామోత్సవం జరిగింది సాయంత్రం మహా స్నపనం చెయ్యాలి పుష్పాది ధాన్యాది ఫలాది అధివాసములు నిత్య హోమాలు జరిపించారు. అలాగే మూడవరోజు ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి 8 గంటల లోపు యంత్ర ప్రతిష్ట రత్నాన్యాసం లోహాన్యాసం గర్త పూజ విగ్రహ ప్రతిష్ట శిఖర ప్రతిష్ట మహాకుంభాభిషేకం శాంతి కళ్యాణం పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరిపించి చివరిగా తీర్థప్రసాద వితరణ జరుగుతుందని అర్చక బృందం తెలియజేశారు. ఈ కార్యక్రమాలను ప్రధాన అర్చకులు గంగాధర స్వామి ఆలయ అర్చకులు నవీన్ స్వామి సురేష్ తేజ శివరామకృష్ణ సునీల్ జనార్ధన ఫణి స్వాములు ఆధ్వర్యంలో జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి పునీతులయ్యారు.

## ప్రాథమికోన్నత పాఠశాలలను

# ఉన్నత పాఠశాలలో మార్పు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రాథమికొన్నత పాఠశాలగా ఉన్న పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయబడినవని మండల విద్యాశాఖ అధికారి మస్తాన్వలి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయగిరి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలుగా ఉన్న ఎంపీ యుపిఎస్ వెంకట్రావుపల్లి, ఎంపీ యుపిఎస్ దాసరపల్లి, ఎంపీ యుపిఎస్ ఉదయగిరి ఉర్దూ పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయడం జరిగిందని, దీనికి సంబంధించి జిల్లా ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు అందినవని కావున పై మూడు ప్రాథమికోన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, ప్రజా ప్రతినిధులు 9, 10వ తరగతి విద్యార్థులు కూడా తమ తమ పాఠశాలలో అడ్మిషన్స్ పొందవచ్చునని తమ తమ క్యాచ్మెంట్ పరిధిలోని అందరికీ తెలియజేయవలసిందిగా తెలిపారు.

# చైర్మన్ మాలేపాటిని కలిసిన చెంగల్ రెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం మాజీ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో రైతు సేవ కేంద్రాల మాజీ అధ్యక్షులు చెంగల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సెలవుతో సత్కరించి ఆయనను అభినందించారు. అనంతరం వారు కొద్దిసేపు రైతుల గురించి రైతు సేవా కేంద్రం గురించి ప్రస్తుతం వ్యవసాయంలో నూతన ఉత్పత్తులు గురించి చర్చించుకున్నారు. రైతులకు ఏ విధంగా సబ్సిడీల విషయంలోనూ వారికి అందించవలసిన సేవలను ఏ విధంగా అందించాలో కూడా ఈ విషయాన్ని గురించి చర్చించుకోవడం జరిగింది.

- అవస్థల ప్రయాణమా.. వామ్మో
- 70శాతం పై చిలుకు భద్రతా నిబంధనలకు తూచ్
- వరుస ప్రమాదాలతో రక్తసిక్తమవుతున్న రహదారులు
- ఆయువు అనంతవాయువుల్లోకి..
- చిద్రమవుతున్న పచ్చని కుటుంబాలు
- కాగితాలకే పరిమితమవుతున్న ప్రమాదాల నివారణ చర్యలు
- డేంజర్ రోడ్లపై సురక్షిత ప్రయాణం ప్రశ్నార్థకమేనా..?

# రహదారులు.. డేంజర్ బెల్స్..

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** నిత్యజీవితంలో ఎన్నోరకాల ఒడిదుడుకులు, ఒత్తిళ్లు ఎదురవుతూ ఉంటాయి. ముఖ్యంగా అత్యధికశాతం మంది వ్యాపారులు, వివిధ హోదాల్లో కొనసాగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీలకు చెందిన నాయకులకు తరచూ వచ్చే ఫోన్‌కాల్స్, ఇతర కార్యక్రమాలపై దృష్టిసారించాల్సి రావడం వంటి కారణాల వల్ల డ్రైవింగ్ సమయంలో వారి ఆలోచనా ధోరణి వేరే వ్యాపకాలపై మళ్లుతుండటంతో ఏకాగ్రతకు భంగంవాటిల్లి ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో తాము స్వయంగా వాహనాలు నడపడం శ్రేయస్కరం కాదనే విషయాన్ని గ్రహించి డ్రైవర్లను నియమించుకుంటారు. ఇలా చేయడం వల్ల సురక్షిత ప్రయాణంతో గమ్యం చేరుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని పరిశీలకు చెబుతున్నారు.

డ్రైవింగ్‌లో అనుభవం, స్టీరింగ్‌పై పట్టు ఉన్నప్పటికీ అదుపులేకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుండటంతో సంభవిస్తున్న వరుసరోడ్డు ప్రమాదాలతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు, కుటుంబ సభ్యుల ఏడుపులు, పెడబొబ్బలు వెరచి జిల్లాల్లో విశాలమైన రహదారులు డేంజర్ బెల్స్‌ను తలపిస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో తరుచూ రోడు ప్రమాదాలు జరుగుతున్న పలుప్రదేశాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్లుగా అధికారులు గుర్తించారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో 2024లో 230 మంది పైచిలుకు మృత్యువాతపడగా.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 60 మందిపై చిలుకు మరణించినట్లు ప్రాథమిక సమాచారం. సంబంధిత అధికారుల వైఫల్యం వల్ల ప్రమాదాల నివారణ చర్యలు కాగితాలకే పరిమితమవుతున్నట్లు చర్చలు సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులను పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో కొరవడిన పర్యవేక్షణ, నిర్వాహణ వల్ల పూర్తిగా పట్టణ, పల్లె ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడం.. రోడ్డుభద్రతా నియామాలను ఏ మాత్రం పాటించకుండా అధికవేగం, నిర్లక్ష్యం, డ్రైవింగ్‌లో అనుభవం లేకపోవడం, స్పీడ్ బ్రేకర్ల వద్ద ఏమరపాటు, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ.. వాహనాలు నడుపుతుండటంతో ఉమ్మడి జిల్లాల్లో రోడు ప్రమాద సంఘటన సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. డ్రైవింగ్‌లో అనుభవం, స్టీరింగ్‌పై పట్టు ఉన్నప్పటికీ రహదారి భద్రత నిబంధనలను పాటిస్తేనే ప్రయాణం సురక్షితంగా సాగుతుందన్న వాస్తవిక సత్యాన్ని విస్మరిస్తున్న అనేక మంది ప్రముఖులను సైతం ప్రమాదాల రూపంలో ఆయువు అనంత వాయువుల్లో కలుస్తుండటంతో రక్తసిక్తమవుతున్న రహదారులు మింగేస్తున్నాయి. ప్రయాణ సమయాల్లో అత్యంత ప్రధానమైన సీటుబెల్టు ధరించకపోతుండటం వంటి చిన్నతప్పిదాలు ప్రమాదాల రూపంలో ప్రాణాలు తీస్తున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావిడి చేయడం.. ఆ తర్వాత నిర్వాహణపరమైన ఊసే ఎత్తకపోతుండటంతో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న నామమాత్రపు చర్యలు కాగితాలకే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో అత్యధికశాతం చిన్న చిన్న తప్పిదాలే కారణంగా కనిపిస్తున్నాయి. ప్రమాదాల్లో కొంత మంది ప్రాణాలు కల్పోతుంటే.. మరికొందరు కదలలేని స్థితిలో మంచాలకే పరిమితమవుతున్నారు. డేంజర్ రొడ్లపై సురక్షిత ప్రయాణం ప్రశ్నార్థకమేనా.? అన్న సందేహాత్మక చర్చలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులపై పూస్థాయిలో దృష్టిసారించింది. అందులో భాగంగానే జిల్లాల్లో దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు పెద్దపీటవేయడంతో అప్రమత్తమైన అధికారులు జిల్లాల్లో 700 కిలోమీటర్ల వరకు మరమ్మత్తులకు గురైన రోడ్లను గుర్తించడంతోపాటు పునర్నిర్మాణానికి రూ.400 కోట్లు ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదికలు పంపారు.



**నిర్వాహణ ముఖ్యం :** కారు, ద్విచక్ర, ఆటోలు, నాలుగు చక్రాలు, లారీలు, ఇతర వాహనాల యజమానులు కనీసం 3 మాసాలకు ఒకసారి మెకానిక్కు చూపించి వాహనం స్థితిగతిపై పరీక్షించుకోవాలి. అలాగే నెలల తరబడి ఉపయోగించని వాహనాలను తిరిగి వినియోగించుకోవాలని భావించిన వెంటనే మెకానిక్ వద్దకు తీసుకెళ్లి అరాకొరా మరమ్మత్తులు, సర్వీసింగ్ చెయించాలి. ఇలా చేయించడం వల్ల చాలా కాలం క్రితం నుంచి మరుగునపడిన వాహనాలను సైతం తిరిగి మంచిరన్నింగ్ కండిషన్తో మనుగడలోకి తెచ్చే అవకాశం ఉంటుంది. ఇదేక్రమంలో రాకపోకల సమయంలో వా వానం వెనుక వచ్చే వివిధ రకాల వాహనాల కదలికలను సులభంగా గుర్తించడంలో మిర్రర్ వ్యూ కీలకంగా ఉపయోగపడుతుంది. కారు ఇతర వాహనాల వేగాన్ని క్రమబద్దీకరించడంలో హ్యాండ్ బ్రేక్ కీలకంగా పనిచేస్తుంది.

# బక్రీదు పండుగ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలం ఆదురుపల్లి గ్రామంలో బక్రీదు పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా మైదానంలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై, సామూహికంగా ప్రార్థనలు చేసి దేశంలో శాంతి, సౌభ్రాత్ర, అభివృద్ధి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మౌలానా మహబూబ్ బాషా బక్రీదు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది త్యాగానికి ప్రతీకగా భావిస్తారని, ఇబ్రాహీం ప్రవక్త అల్లాహ్ ఆదేశం మేరకు తన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధపడిన సంఘటన ఈ పండుగకు ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. ఈ పండుగ ద్వారా ప్రతి ఒక్కరూ త్యాగ భావనను, దయా ధర్మాలను అవలంబించాలన్నారు. అనంతరం మౌలానా బాషా మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడుచుకుంటూ జీవితాన్ని నైతిక విలువలతో గడపాలని, ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో



కొంత భాగాన్ని పేదల సహాయార్థం వినియోగించాలి అని పిలుపునిచ్చారు. చివరగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

▶ నెల్లూరు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీధర్

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఏపీదక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ అధీనంలో ఉన్న పొదలకూరురోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున క్యాన్సర్ హాస్పిటల్, జడ్పీకాలనీ, సారాయి అంగడి, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమీనగర్, ప్రగతినగర్, పొదలకూరురోడ్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివే యడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పులను సహృదయులైన విద్యుత్ వినియోగదారులు గమనించాలని, అత్యవసర విభాగం వారు ముందస్తు ఏర్పాటు చేసుకొ వాలని ఆయన సూచించారు.

# ఆరోగ్యం ఆదాయం నేరేడు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** అల్ల నేరేడు పండు అని పిలుచుకునే నేరేడు పండ్లుకు మన దేశం పుట్టినిల్లు. అస్సాం బీహార్ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు పశ్చిమబెంగాల్ మహారాష్ట్ర గుజరాత్‌లో ఎక్కువగా సాగు అవుతుంది.

**నేరేడులో సుగుణాలు :** అల్లా నేరేడు పండులు ఇనుము చక్కెర ఖనిజ లవణాలు ప్రోటీన్లు పిండి పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి.

**ఔషధ గుణాలు మెండు :** మధుమేహం నియంత్రణకు గుండె కాలేయం పనితీరు మేరుగుదలకు దోహదపడుతుంది కడుపులో ఏవైనా వెంట్రుకలు ఉంటే వాటిని కరిగించే గుణం ఉంది కడుపులో పురుగుల్ని చంపే గుణం కూడా ఉంది నేరేడు పండును జామ్ జెల్లీ స్క్వాష్ వైన్ వెనిగర్ పచ్చళ్ళ తయారీలో ఉపయోగిస్తారు.



### 100 గ్రాముల నేరేడు పండులో ఉండే వివిధ పోషకాలు

నీరు 83.13 గ్రాములు విటమిన్ బి 1.006 మిల్లీ గ్రాములు కాల్షియం పది మిల్లీ గ్రాములు శక్తి 60 కిలో క్యాలరీలు విటమిన్ బి2 0.01 మిల్లీగ్రామ్ విటమిన్ బి త్రీ 0. 2 60 గ్రాములు విటమిన్ బి 60.038 మిల్లీగ్రాములు విటమిన్ సి 14.30 మిల్లీగ్రాములు ఇనుము 0.19 మిల్లి గ్రాములు ప్రోటీన్ 0.72 గ్రాములు ఫాస్పరస్ 17 మిల్లీగ్రాములు కొవ్వు పదార్థాలు 0.23 గ్రాములు పొటాషియం 79 మిల్లీగ్రాములు పిండి పదార్థాలు 15.5 గ్రాములు సోడియం 14 మిల్లీ గ్రాములు ఉంటుందని ఉద్యాన శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

**సాగుకు నేల రకాలు :** నేరేడు సాగుకు అన్ని రకాల నేలలు అనుకూలం ఎర్రగరప తేలికపాటి నల్ల నేలలు బరువైన నల్ల రేగడి నేలల్లో కూడా సాగు చేయవచ్చు ఉప్పు చౌడు భూములు నాలుగు, ఏడు రోజులు నీరు నిల్వ ఉన్న నేలలు కూడా సాగుకు అనుకూలంగా ఉంటుంది.

**మొక్కల ఎంపిక :** కొమ్మంటూ పద్ధతి ద్వారా వృద్ధి చేసిన అంటు మొక్కలను వేరుమూలంపై 15 సెంటీమీటర్ల ఎత్తులో అంటుకట్టిన మొక్కలను ఆరు నెలల నుంచి సంవత్సరం వయసుగల అంట్లను రైతులు రిజిస్టర్ అయిన నర్సరీలు పరిశోధనా స్థానాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

# ప్రతిభకు మారుపేరు ఈస్ట్ వుడ్స్ ఇంగ్లీష్ పాఠశాల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రతిభకు మారుపేరుగా విద్యార్థులకు బంగరు భవిష్యత్తును అందించే విధంగా నైపుణ్య విద్యకు మారుపేరుగా ఈస్ట్ వుడ్స్ ఇంగ్లీష్ పాఠశాల నిలిచింది. వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామ సమీపంలో ఉన్న ఈస్ట్ వుడ్స్ ఇంగ్లీష్ పాఠశాల విద్యార్థిని చే రెడ్డి తనూజ గత పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 590 మార్కులు సాధించి అత్యద్భుతమైన ప్రతిభను చాటి షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డుకు ఎంపికయింది. ఈ అవార్డుకు ఎంపిక కావడానికి ఆమెలోనే నిరంతర కృషి ప్రయత్నము దీక్ష పట్టుదల ఒక ఎత్తు కాగా ఉపాధ్యాయుల కృషి యాజమాన్య ప్రోత్సాహం మరో వ్యక్తిగా నిలిచింది పాఠశాల యాజమాన్యం విద్యార్థుల యొక్క భవిష్యత్తు కోసం నూతనమైన సాంకేతికపరమైన విద్యను అందించేందుకు ముందంజలో ఉంటుంది. అలాంటి పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో బంగారు బాటను వేయడానికి పూర్తి అవకాశం ఉంటుంది. అలాంటి బంగారు అవకాశాన్ని తనూజ పొందింది. ఇందుకు ఈ పాఠశాల యాజమాన్యం పి.మధుబాబు, పి.యామిని దేవి, వైస్ ప్రిన్సిపాల్ డిపి ప్రసాద్, ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించింది. భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ అవార్డులను పొందాలని ఆకాంక్షించింది.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మెరుగుపడ్డ జిల్లా స్థానం

**- డిఐఈఓ శ్రీనివాసులు**



**చిత్తూరుప్రతినిధి మేజర్‌న్యూస్:** ఇంటర్మీడియట్ బోర్డు శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో చిత్తూరు జిల్లా, గత మార్చిలో కంటే మెరుగైన ఫలితాలు సాధించినట్లు డిఐఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గత ఫలితాల్లో చిట్ట చివరి స్థానంలో ఉన్న జిల్లా, రెండవ సంవత్సరం ఫలితాల్లో జనరల్ విభాగంలో 58 శాతం, 66 శాతం ఒకేషనల్ విభాగంలో ఉత్తీర్ణత శాతాన్ని సాధించినట్లు డిఐఈఓ పేర్కొన్నారు. ఈనెల తొమ్మిదవ తేదీ నుండి 13 వరకు, 1,300 రూపాయలు ఆన్లైన్లో చెల్లించి రీ వెరిఫికేషన్, 260 రూపాయలు చెల్లించి రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీనివాసులు సూచించారు.

## వెబ్ కౌన్సెలింగ్ వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నిరసన

**కార్వేటినగరం మేజర్ న్యూస్:** వెబ్ కౌన్సెలింగ్ వ్యతిరేకంగా కార్వేటినగరం మండల విద్యా వనరుల కేంద్రం మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## జనసేన పార్టీ నేత హరిప్రసాద్‌ను కలిసిన శ్రీకాళహస్తి నాయకులు

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హస్తకళలు రాష్ట్ర అభివృద్ధి చైర్మన్. జనసేన పార్టీ పిఏసి సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ని తిరుపతి జిల్లా పార్టీ ఆఫీస్ లో శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు మర్యాదవపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంలో హస్తకళలు అభివృద్ధి దిశగా ప్రతి ఒక్క జనసేన నాయకులు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, మనీ,మహేష్, లక్ష్మణ్,ప్రదీప్, నవీన్, హరి, గిరిబాబు, చందు, వెంకటేష్, వీర మహిళలు కవిత, శారద, పూజిత, తదితరులు పాల్గొన్నారు.





## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

**సత్యవేడు మేజర్‌న్యూస్:** ముస్లింల త్యాగనిరతిని ధర్మ నిబద్ధతను, దైవ భక్తినీ చాటే పండుగ బక్రీద్, మనకు కలిగిన దానిని సాటి వారితో కలిసి పంచుకోవాలని చెప్పే గొప్ప మానవతా వాదాన్ని చాటే పండుగ బక్రీద్.త్యాగానికి ప్రతీక అయిన పండుగను, భక్తి ప్రపత్తులతో జరుపుకుంటున్న సత్యవేడు నియోజకవర్గ ముస్లింలందరికీ, మిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలుగుదేశం పార్టీ తరపున పవిత్ర బక్రీద్ పండుగ శుభాకాంక్షలు, తెదేపా సత్యవేడు పరిశీలకులు చంద్రరశేఖర్ నాయుడు తెదేపా సత్యవేడు కో ఆర్డినేటర్ డా'శ్రీపతి బాబు తెలియజేశారు.

## శివయ్య సేవలో ఏపీ హైకోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి వి. రాధా కృష్ణ కృపా సాగర్ శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేశారు. వారిని దేవస్థానం అధికారులు స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రత్యేక దర్శనం చేయించారు.



# వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**- మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె**



**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** ఆంధ్రుల కలల రాజధాని ప్రజా రాజధాని అయిన అమరావతి నిర్మాణ పనులు వేగం పుంజు కోవడాన్ని చూసి జీర్ణించుకోలేక, తన సాక్షి ఛానల్ చర్చా కార్యక్రమంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ డ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వవార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాక్షి ఛానల్ లో జరిగే ఏ చర్చా కార్యక్రమమైన జగన్ రెడ్డి డైరెక్షన్ లో జరుగుతుంది. ఈరోజు కూడా అమరావతిని కించపరుస్తూ, అమరావతి మహిళల శీలహననం చేయించిన జగన్ రెడ్డిని సంఘం నుండి బహిష్కరించాలని యావత్ భారతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు.ఆచార్యుడు నాగార్జునుడు ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రాంతం అమరావతి, ప్రముఖ బౌద్ధ క్షేత్రం అమరావతి, శాతవాహనుల రాజధాని అమరావతి, బిసిలు, యస్సీలు మరియు యస్టీలు అధిక సంఖ్యలో నివసించే అన్ని వర్గాల ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ రెడ్డి ఇటువంటి చౌకబారు విమర్శలు చేస్తూ తన అక్కసు వెళ్ళగక్కుతున్నాడని ఆరోపించారు. జగన్ రెడ్డి పాలనా కాలంలో జరిగిన కుంభకోణాలు నుండి ప్రజల దృష్టిని మరల్చడానికే వైసిపి సైకోలు ఇటువంటి నీచ పనులకు దిగజారారు అని, తన రాజకీయ మనుగడకు ఎంతటి అరాచక చర్యలైనా చేసి, అత్యంత హేయమైన ప్రవర్తనకు కూడా వెనుకాడని సైకోల బృంద నాయకుడు జగన్ రెడ్డి పైన, మీడియాలో మాట్లాడిన వారి పైన, సాక్షి యాజమాన్యం పైన మహిళా కమిషన్, యస్సీ, యస్టీ మరియు మానవ హక్కుల కమిషన్ క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు. దాన ధర్మాలకు ప్రతీక బక్రీద్

**రొంపిచెర్ల మేజర్‌న్యూస్:** మండలంలో బక్రీద్ పండుగను ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగ దాన ధర్మాలకు ప్రతీక అని ముస్లీం మత గురువు అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ రోజు ఖుర్బానీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ముస్లీంలు బక్రీద్ పండుగ సందర్భంగా ఇచ్చే కుర్బాని నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ముస్లీంలు ఉదయాన్నే ఈద్గా వద్ద చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనాలు చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి, దాన ధర్మాలకు ప్రతీక గా నిలిచే బక్రీద్ పండుగ ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఈద్గా వద్ద రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి తన సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పించారు.



## విద్యుత్ దీప కాంతులతో మిరిమిట్లు గొలుపుతున్న గాంధీ స్మారక స్థూపం

**సత్యవేడు మేజర్ న్యూస్:** పట్టణంలోని మహాత్మా గాంధీ స్మారక స్తూపం విద్యుత్ దీప కాంతులతో మిరిమిట్లు గొలుపుతున్నాయి. పట్టణంలో జూన్ 11,12 తేదీల్లో నిర్వహించనున్న గంగ జాతరను పురస్కరించుకుని జాతర నిర్వాహకులు గాంధీ స్మారక స్థూపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.మిరిమిట్లు గొలుపుతున్న విద్యుత్ దీప కాంతులు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

## వైభవంగా రామకోటి ఉత్సవాలు



**శాంతిపురం మేజర్‌న్యూస్ :** మండలంలోని 121 పెద్దూరు గ్రామం లోని వీరాంజనేయ స్వామి దేవాలయం నందు రామకోటి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారాములను ప్రతిష్టాపన చేసిమూడు రోజులపాటు అఖండ జ్యోతి వెలిగించి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య అన్నదానం పండరి భజన కోలాటాలు ప్రదర్శించారు దేవాలయం నందు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిపించి గ్రామ వీధుల్లో బాన వేడుకల మధ్య సీతారాముల ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# ఔషధ గుణాల సంజీవని..

# ఎర్రచందనం



- చైనీయులకు మరింత ప్రియం ప్రీతిపాత్రం..
- అదేబాటలో పాశ్చాత్యదేశాలు మక్కువ
- రక్తచందనం ఆవాస ప్రాంతంగా..
- తూర్పుకనుమల్లోని శేషాచలం కొండలు
- పుష్ప సినిమాతో మరింతగా పెరిగిన ఆకర్షణ

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** కాకులు దూరని కారడవులు, చీమలు దూరని చిట్టడవులు, కన్ను పొడుచుకున్నా కానరాని చీకట్ల మధ్య ఆణిముత్యంలా తొణికసలాడుతున్న ఔషద గుణాల సంజీవని ఎర్రచందనం జాతికి చెందిన వృక్షాలపై గొడ్డళ్లు, రంపపు కోతలు మాత్రం నిర్విరామంగా దాడిచేస్తూనే ఉంటాయి. పోలీసు అటవీశాఖ విభాగాలకు చెందిన వేలాది మంది అధికారులు, సిబ్బంది మాత్రం ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా లెక్క చేయకుండా రాత్రింబవళ్లూ రెప్పవాల్చకుండా స్మగ్లర్ల ఆటలు కట్టించేందుకు రహస్య మార్గాలు, ఎర్రచందనం అధారిత ప్రాంతాలు, డంప్లపై నిఘావేసి గాలింపులు, కూంబింగ్ చర్యలు ముమ్మరం చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక టాస్క్ ఫోర్స్. అటవీ అధికారుల సమన్వయంతో చేపడుతున్న మెరుపుదాడులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మానవునికి ఎదురయ్యే అనేక రకాల అనారోగ్యసమస్యలను సునాయాసంగా నయం చేయడంలోనూ. ఆహారపదార్థాల తయారీలోనూ, తేలువి షానికి విరుగుడుగానూ, విలాసవంతమైన ఫర్నిచర్గానూ, న్యూక్లియర్ రియాక్టర్ల నుంచి వెలువడే వేడిని సైతం తగ్గించడంలోనూ, గంధం మాదిరిగా సుగంధ పరిమళభరితం కాకపోయినప్పటికీ కాస్మెటిక్స్ తయారీకి అవసరమైన తైలాన్ని అందించడంలోనూ ఇలా అనేక రూపాల్లో అనేక విధాలుగా ఉపకారం చేస్తున్న ఎర్రచందనం.. మరింత ప్రియంగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదనిపిస్తోంది. ప్రధానంగా తూర్పుకనుమల్లోని శేషాచలం కొండల్లో లభించే అరుదైన ఎర్రచందనం మొక్క తొలి మూడేళ్లూ వేగంగా పెరుగుతుందని, తరువాత నెమ్మదిగా పెరగడం మొదలు పెడుతుంది. ఇలా 30ఏళ్లు కాలపరిమితి దాటిన ఆర్వాత చెట్టుమధ్యలో ఎరుపు రంగు (చేవ)లోకి మారుతుంది. అదే 100 నుంచి 200 సంవత్సరాలపాటు పెరిగిన భారీ వృక్షమైతే లోపలిభాగం మరింత ఎర్రగానూ, వెడల్పుగానూ ఉంటుంది. 1999లో తొలిసారిగా ప్రజల సందర్శనార్థం చైనాలో రెడ్ శాండిల్ ఉడ్ మ్యూజియంను తెరిచారని వృక్షశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. రెడ్ శాండిల్ ఉడ్ మ్యూజియంలో ఎర్రచందనంతో తయారు చేసిన అధ్భుతమైన కళాకృతులు. హన్మింగ్, క్వింగ్ వంశీయుల రాజప్రసాదాల నుంచి సేకరించిన లక్షల కోట్ల రూపాయల సంపదంతా రెడ్ శాండిల్ ఉడ్ మ్యూజియంలో ఉండటం విశేషం. అరుదైన ఎర్రచందనంతో తయారు చేసిన కళాకృతులు, ఫర్నిచర్ మక్కువ పెంచుకున్న చైనా రాజులు ఖర్చుకు వెనుకాడకుండా విరివిగా కొనుగోలు చేసి తెప్పిస్తుండటంతో దేశంలోనూ, చుటుప్రక్కల పెరిగే ఎర్రచందనం వృక్ష సంపద క్రమేణ అంతరించిపోయింది. ఈ అన్వేషణలో చైనీయుల దృష్టి భారతదేశంలోని తూర్పుకనుమల్లో ఉన్న శేషాచలం కొండల్లో దొరికే రక్తచందనం మీదపడింది. దీంతో కొన్ని వందలు, వేల సంవత్సరాలుగా ఎర్రచందనం సంపద చైనాదేశానికి ఎగుమతి అవుతూ అక్కడ కోటల్లో అందంగా కొలువుదీరబడింది. ఎంతో ధృఢంగా ఉన్నప్పటికీ ఎంతో మృథుత్వం కలిగిన ఎర్రచందనం కలపతో కళారూపాలు చెక్కడానికి అనువుగా ఉంటుందని గుర్తించిన చైనీయులు పోటీపడటంతో గత నాలుగేళ్ల క్రితం జరిగిన ఓ వేలంపాటలో గృహాలంకరణలో భాగంగా వాడే ఫోల్డింగ్ స్క్రీన్ అక్షరాలా రూ. 170 కోట్లకు అమ్ముడు పోవడం విశేషమని విశ్లేకులు చెబుతున్నారు. ఇదే క్రమంలో రూయీ అనే అతిచిన్న కళారూపం సైతం రెండేళ్ల క్రితం జరిగిన వేలంపాటలో రూ. 5కోట్లకు అమ్ముడుపోవడాన్ని బట్టి రక్తచందనంతో తయారు చేసిన ఫర్నిచర్స్ చైనాలో ఏ స్థాయి క్రేజ్‌ను దక్కించుకున్నాయో అర్థం చేసుకోవచ్చు.

**ఉపయోగాలు :** ఔషదగుణాలు కలిగిన ఎర్రచందనం పొడిలో రోజ్వాటర్ వేసి ముద్దగా చేసుకొని నుదుటిమీద పెట్టడం వల్ల తలనొప్పి, మైగ్రేయిన్ వంటి సమస్యలు దూరమవుతాయని, ఇదే పొడిలో శనగపిండి, నిమ్మరసం, రోజ్ వాటర్ కలిపి పేస్టులా తయారు చేసి మాస్కులా వేసి పూర్తిగా ఆరిన తర్వాత కడిగివేయడం వల్ల ముఖం నిఘారింపును సంతరించుకుంటుందని, విలాసవంతమైన ఫర్నిచర్‌తోపాటు అటు అందం.. ఇటు ఔషధంగా కూడా విరివిగా ఉపయోగిస్తుండటం విశేషమని వృక్షశాస్త్రజ్ఞుల పరిశోధనల ద్వారా నిర్ధారణ అయినట్లు సమాచారం. జీర్ణసంబందమైన సమస్యలు, దగ్గు, జలుబు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు, క్యాన్సర్ నివారణలోనూ, రక్తాన్ని శుద్ధిచేయడంలోనూ, మూత్రం ద్వారా శరీరం నుంచి నీరు ఎక్కువగా పోకుండా క్రమబద్ధీకరించడంలోనూ ఎర్రచందనం అమృత సంజీవనిగా దోహదపడుతుందనేది వైద్య నిపుణుల వాదన. అలాగే ఎర్రచందనం చెక్కను సువాసనతో కూడిన రుచికోసం ఆల్కాహాల్ తయారీలో సైతం వాడుతుండటం గమనార్హం. ఈ పొడిని రోజ్ వాటర్‌లో కలిపి మచ్చలు, మొటిమల మీద రాస్తే అవి క్రమేణ తగ్గుతాయని, ఈ చెక్కనూ ముద్దలా చేసి గాయాలమీద పెడితే త్వరగా నమయమవుతాయని, ఈచెట్టు బెరడును చక్కెరవ్యాధి నివారణకు వాడుతారని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎన్నోరకాలుగా ప్రయోజనకారి అయిన అరుదైన రక్తచందనాన్ని కోట్లాది రూపాయలు చెల్లించి మరీ అక్రమంగా తరలించుకుపోతున్నారు.

## పాశ్చాత్యుల్లోనూ పెరిగిన మక్కువ..

చైనీయులు గృహోపకరణాలుగా వాడుతున్న ఎర్రచందనం ఫర్నిచర్ను చూసిన తర్వాత పాశ్చాత్యదేశాలు సైతం ఎర్రచెక్క మీద మక్కువ ఎంచుకుంటూ మనస్సు పారేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎర్రచందనంకు విపరీతమైన డిమాండ్ పెరగడంతోపాటు వృక్షాలు కూడా క్రమేణ హరించుకుపోతుండటంతో అంతరించిపోతున్న జాబితాలోకి చేరుతున్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అడవుల్లోని వృక్షాలను నరకడం చట్టవిరుద్ధంగా పేర్కొనడంతోపాటు చెట్ల పెంపకం.. అమ్మకాలపై ఆంక్షలు విధించింది. అయినప్పటికీ ఏదో ఒక రూపంలో అరుదైన ఎర్రచందనం నరికి సరిహద్దులు దాటిస్తుండటం గమనార్హం. ఎర్రచందనం అక్రమ రవాణా ఫలితమే శేషాచల అడవుల్లో స్మగర్లను అడుకునే ప్రయత్నాల్లో భాగంగా ఎదురొడ్డి పోరాడిన పోలీసులు, అటవీ ఉద్యోగులు మరణించారనో.. లేదా 1000 మందికి పైగా స్మగ్లర్లు పట్టుబడ్డారనో.. చెకోపోస్టులు దాటుతున్న సరుకును పటుకున్నారనే సమాచారాలతో అప్పుడప్పుడు వార్తా పత్రికల్లో కథనాలు వెలువడుతున్న విషయం తెలిసిందే.

## బహుళప్రయోజనకారి ఎర్రచందనం..

- **డీఎఫ్ఓ మహబూబ్ బాషా**



విలాసవంతమైన ఫర్నిచర్‌తోపాటు ఔషధపరంగానూ బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడుతున్న ఎర్రచందనం సంపదను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ టెక్నాలజీ సైన్స్ ప్రకారం తలనొప్పి, చర్మవ్యాధులు, జ్వరం, కంటి సమస్యల నివారణతోపాటు తేలు విషానికి విరుగుడుగా రక్తచందనాన్ని ఉపయోగిస్తారు. ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న ఎర్రచందనాన్ని జిల్లా సరిహద్దులు దాటకుండా కాపాడుకునేందుకు పటిష్ట నిఘాచర్యలతో అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచామని, స్మగ్లర్ల కదిలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచడం జరిగిందని, అనుమానస్పద వ్యక్తుల కదలికలపై డేగకన్నుతో గమనిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కలప తరలింపుపై సమగ్ర విచారణ జరపాలి : వైసీపీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో కూటమి పాలనలో పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, తాజాగా మండలపరిషత్ కార్యాలయ పాతభవనం తొలగింపు, అక్కడి టేకు కలపను తరలించడం గురించి అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, జెడ్పిటిసి మెంబర్ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. ఎంపిపి కార్యాలయాన్ని కూల్చివేసి అక్కడి విలువైన కలపను చెర్లోయడవల్లికి ఎందుకు తరలించారో ప్రజాప్రతినిధులు, అధికారులు సమాధానం చెప్పాలని వారు కోరారు. ఓ ప్రజాప్రతినిధికి దోచిపెట్టేందుకే అధికారులు సహకరిస్తున్నారా అని వారు ప్రశ్నించారు. గతంలో నారంపేట వద్ద రెండుకోట్ల రూపాయల విలువైన జామాయిల్‌చెట్లను నరికి సొమ్ము చేసుకున్నా, తాజాగా కలపను గ్రామానికి తరలించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలిసే ఉంటుందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. మంత్రి పేరుచెప్పి గ్రామానికి తరలించిన కలపవిషయమై మీడియాపరంగా ప్రచారం జరుగగానే కలపను కార్యాలయానికి తరలించారని, అయితే 30శాతం మాత్రమే తరలించారని వారు ఆరోపించారు. ఈసంఘటనపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ జమీర్‌బాషా, బొలిగర్ల వెంకటేశ్వర్లు (సర్పంచ్), కల్పనారెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా నృసింహుని కల్యాణం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది, బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే నాల్గోవ శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం వివిధ ఆభరణాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛరణలు పటిస్తూ కనుల పండువగా కల్యాణం జరిపించారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, అనంతరం స్వామి, అమ్మవార్లను తిలకించేం దుకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.